సాక్షి జగిత్యాల

గురువారం । 16 । మే । 2024



తోటలో పేలిన తూటా

రాష్ట్ర సాధనే లక్ష్యంగా విప్లవ ఉద్యమాలు రూపొందించారు మారోజు వీరన్న. సహచరులతో విభేదించి సొంతంగా విప్లవోద్యమాన్ని నిర్మించారు.

- 8లో▸



ఉపాధిలో మహిళలే అధికం

ఉపాధిహామీ పనుల్లో మహిళా కూలీలు అధికంగా పాల్గొంటున్నారు.

9లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0/27.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమిగా ఉంటుంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న నృసింహుడి నవరాత్రి ఉత్సవాలు



ధర్మపురిలో స్వామివార్లకు అభిషేకం, హోమం చేస్తున్న పూజారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైనా బుధవారం ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, హోమం చేశారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్ని వసతులూ కల్పించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

డెంగీ నివారణపై అవగాహన కల్పించాలి




సారంగాపూర్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సారంగాపూర్: డెంగీపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డెంగీ ఏడిస్ ఈజిప్ట్ దోమ మధ్యాహ్న సమయంలో కుట్టడం ద్వారా వ్యాపిస్తుందని, తీవ్రమైన తలనొప్పి, జ్వరం ఉంటుందని, శరీరంపై దద్దుర్లు వస్తారని పేర్కొన్నారు. కండరాల నొప్పులు, కీళ్లనొప్పులు వచ్చి ఆకలి తగ్గుతుందన్నారు. అలాంటి వారిని గుర్తించి వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇళ్ల పరిసరాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలన్నారు.

మల్యాలలో..

మల్యాల: పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమల నివారణతోనే డెంగీ నియంత్రణ సాధ్యమని శ్రీనివాస్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం



జగిత్యాలటౌన్: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1, సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రూప్–1కు సంబంధించి ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1,3 తేదీల్లో ప్రిలిమ్స్ పరీక్ష కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తామని, యూపీఎస్సీకి సంబంధించి ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీల్లో పరీక్షలు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరుగుతాయని వివరించారు. www.tsbcstudycircle.cgg.gov.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి సమాచారం కోసం 040–24071178, 040–27077929 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కోడ్ ఉల్లంఘించిన ప్యాక్స్ సిబ్బంది సస్పెన్షన్

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేసిన మెట్‌పల్లి, బండలింగాపూర్ విశాల సహకార పరపతి సంఘాలకు చెందిన ఇద్దరు ఉద్యోగులు చెదలు రాజేశ్, అంకం శంకర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. రాజేశ్, శంకర్ ఓ రాజకీయ పార్టీకి సంబంధించి తమ వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకున్నారు. అలాగే మరో పార్టీని విమర్శిస్తూ వాయిస్ మెసేజ్‌లు పోస్ట్ చేశారు. విచారణ చేపట్టగా నిజమేని తేలడంతో కోడ్ నిబంధనల మేరకు ఇద్దరిని సస్పెండ్ చేశామని డీసీఓ తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు



జగిత్యాల: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంచినట్లు నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఈనెలలో జరిగే ఇంటర్ పరీక్షలకు రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఈనెల16వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు.

కలిసొచ్చేది ఎవరికో..?

- ఓటింగ్ సరళిపై జోరుగా చర్చ
- పార్టీ అభ్యర్థులందరిలోనూ ధీమా
- మహిళల ఓట్లే కీలకమనే భావన

జగిత్యాల: ఎన్నికలు ముగియడంతో జిల్లాలో ఎక్కడ చూసినా ఏ అభ్యర్థి గెలుస్తాడో..? అనే చర్చనే కొనసాగుతోంది. జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, జంక్షన్ల వద్ద ఎక్కడ చూసినా చర్చించుకుంటున్నారు. ఇటు ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం పోలింగ్ సరళిని ఆరా తీస్తూ ఎక్కడెక్కడ ఎన్ని ఓట్లు వస్తున్నాయో అంచనా వేసుకుంటున్నారు. ప్రతి నియోజకవర్గంలో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తూ ఏ గ్రామాల్లో ఎంత మెజార్టీ వస్తుందో లెక్కలు వేసుకుంటూ గెలుపుపై ఎవరికివారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఓట్లు వినియోగించుకోవడంతో వారి ఓట్లనే ఎక్కువగా లెక్కగడుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు వస్తాయి. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోకి ధర్మపురి నియోజకవర్గం వస్తుంది. ఈ నియోజకవర్గాలు ఓటర్లు ఎటు వైపు మొగ్గారో వేచి చూడాల్సి ఉంది.

ఈవీఎంల్లో భవిష్యత్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల భవిష్యత్ ఉంది. ఇప్పటికే ఈవీఎంలను భద్రంగా నిజామాబాద్‌లోని డిచ్‌పల్లికి తరలించారు. జూన్ 4న ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో వాటిని మూడంచెల భద్రత మధ్య ఉంచారు. అభ్యర్థులు మాత్రం ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రధానంగా పోటీపడగా.. నువ్వా నేనా అన్నరీతిలో గెలుపోటములపై ఎవరి ధీమాతో వారు విశ్వాసంగా ఉన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా జగిత్యాలకు జీవన్‌రెడ్డి పోటీకి దిగగా నిజామాబాద్‌కు చెందిన బీజేపీ నుంచి అర్వింద్, బీఆర్ఎస్ నుంచి గోవర్ధన్ పోటీపడ్డారు.



పెగడపల్లిలో బారులు తీరిన ఓటర్లు

పెరుగుతున్న టెన్షన్

అభ్యర్థుల్లో రోజురోజుకూ టెన్షన్ పెరుగుతోంది. ఓట్ల పండుగ ముగిసిపోవడంతో సర్వేలు, పోలింగ్‌పై అంచనాలు వేయడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. అంతటా పోలింగ్ గురించే చర్చించుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులే కాకుండా ప్రజల్లో సైతం ఎవరు గెలుస్తారనే చర్చలు ఊపందుకున్నాయి. హోరాహోరీగా పోటీ కొనసాగడంతో ఓటర్ల మనోభావాలను ఆధారంగా చేసుకుని ఫలితాలపై ఊహాగానాలు వేసుకుంటున్నారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలు తేడా లేకుండా జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు నెల రోజుల పాటు ప్రచారంలో మునిగి తేలినప్పటికీ నిత్యం అధికారులు, నాయకులతో చర్చించుకుంటూ విరామం దొరికితే విశ్రాంతి తీసుకుంటున్నారు.

‘ఆదర్శ’ కేంద్రాల్లో పోలింగ్ అంతంతే

- కొన్ని చోట్లనే మెరుగు
- అవగాహన కల్పించినా ఫలితం శూన్యం

జగిత్యాల: ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్, పెద్దపల్లి పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో ఐదు మహిళా కేంద్రాలు, మరో ఐదు మోడల్, ఒకటి దివ్యాంగులకు, ఒకటి కేవలం యువత కోసం పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఓటర్లను ఆకర్షించేలా రంగులు, హంగులు వేయడంతోపాటు పచ్చని పందిళ్లు కూడా వేశారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఓటు శాతం పెంచాలనే ఉద్దేశంతో ఇలా ఏర్పాట్లు చేసినప్పటికీ ఓటర్లు మాత్రం అంతంతమాత్రంగానే ముందుకొచ్చారు. ఏ బూత్‌లోనూ 70 శాతానికి ఓటింగ్ మించలేదు. ఆదర్శ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతోపాటు పోలింగ్ శాతం పెంచేలా విస్తృతంగా అవగాహన కల్పించినా ఆశించినస్థాయిలో ఓటింగ్ నమోదు కాలేదు. మహిళా కేంద్రాల్లో జగిత్యాలలోని తిప్పన్నపేట, కోరుట్లలోని బండలింగాపూర్, ధర్మపురిలోని పెగడపల్లి కేంద్రాల్లో కొద్దిమేర ఆశించిన మేర పోలింగ్ నమోదైంది. మోడల్ కేంద్రాల్లో కోరుట్లలో ఎస్ఎస్ఆర్ తండా, జగిత్యాలలోని చిత్రవేణిగూడెం, ధర్మపురిలో ధర్మపురి పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువగా నమోదైనా మిగతా వాటిల్లో నమోదు కాలేదు. మహిళల కోసం ప్రత్యేకంగా రంగురంగులతో ఏర్పాటు చేసినప్పటికీ ఓటుహక్కు వినియోగించుకోవడంలో ముందుకు రాలేదు.



ఆదర్శ మహిళా కేంద్రం

జిల్లాలో మోడల్ కేంద్రాల్లో ఓటింగ్ నమోదు ఇలా..

కేంద్రం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
మహిళాకేంద్రం.. కోరుట్ల నియోజకవర్గం:		
అమ్మక్కపేట	739	596
బండలింగాపూర్	468	390
వెంకటాపూర్	699	571
మోహన్‌రావుపేట	1,061	784
కోరుట్ల	964	708
జగిత్యాల నియోజకవర్గం:		
సింగరావుపేట	1,102	863
పెంబట్ల	1,063	823
తిప్పన్నపేట	643	574
జగిత్యాల	1,040	701
జగిత్యాల	1,220	780
ధర్మపురి నియోజకవర్గం:		
నేరెళ్ల	815	597
దట్నూర్	917	715
ఇబ్రహీంనగర్	1,003	774
చిన్నాపూర్	1,076	806
పెగడపల్లి	556	432
మోడల్ పోలింగ్ కేంద్రం.. కోరుట్ల నియోజకవర్గం:		
కోరుట్ల	939	637
గుమ్లాపూర్	578	481
వేంపేట	1,099	895
ఏఎస్ఆర్‌తండా	275	219
మెట్‌పల్లి	1,264	818
జగిత్యాల నియోజకవర్గం:		
అల్లీపూర్	1,163	848
కల్లెడ	1,256	904
చిత్రవేణిగూడెం	408	360
జగిత్యాల	1,343	944
జగిత్యాల	814	586
ధర్మపురి నియోజకవర్గం:		
వెల్గటూర్	1,243	851
దోనూర్	1,012	703
ధర్మపురి	952	570
ధర్మపురి	482	362
గొల్లపల్లి	1,089	802
దివ్యాంగుల పోలింగ్ కేంద్రం		
మెట్‌పల్లి	1,440	910
జగిత్యాల	638	396
ధర్మపురి	691	514
యూత్ పోలింగ్ కేంద్రం		
మెట్‌పల్లి	1,132	873
జగిత్యాల	1,387	916
రాయపట్నం	1,000	814

తప్పుడు సర్వేతో పట్టా చేస్తారా..?



తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా చేస్తున్న ఒబులాపూర్ గ్రామస్తులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒబులాపూర్ గ్రామస్తుల ధర్నా
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ శివారు సోంబోస్ గుట్ట భూమిని తప్పుడు సర్వేతో పట్టా చేయించుకున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి భారీగా తరలివచ్చి ధర్నాకు దిగారు. గ్రామ శివారులోని 41 సర్వే నంబర్‌లో సోంబోస్ గుట్ట భూములు ఉన్నాయని, అక్కడ వనసంరక్షణ సమితి ద్వారా 35ఏళ్లుగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని పేర్కొన్నారు. ముత్యాల రాజలింగం అనే వ్యక్తి సర్వే నంబర్లు 41, 47, 48లో భూమిని ఆక్రమించి తప్పుడు సర్వేతో 49/బి సర్వే నంబర్ కింద పట్టా చేయించుకున్నారని తెలిపారు. 35 ఏళ్లుగా పెంచుతున్న చెట్లను నరికివేస్తూ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తహసీల్దార్ వీర్‌సింగ్ ఆందోళనకారులతో మాట్లాడారు. తప్పుడు సర్వేకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, 49/బీ సర్వేనంబర్‌ను రీ సర్వే చేయించాలని, సోంబోస్ గుట్ట భూమిని కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. రీ సర్వే చేయించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ప్రజలు వంశీవైపే నిలిచారు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి వంశీవైపే నిలిచారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాళీ ఖజానాను అప్పగించినా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చుతామన్నారు. స్థానికంగా డిగ్రీ, పాలిటెక్నిక్ ఏర్పాటుతోపాటు ఈ ప్రాంతానికి అవసరమైన అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని వెల్లడించారు. నాయకులు దినేష్, నిశాంత్‌రెడ్డి, సుభాష్, వేముల రాజేశ్, లక్ష్మణ్, ప్రసాద్, సుధాకర్, సుముఖ్, రవీందర్ పాల్గొన్నారు.

దారిమళ్లిన అగ్నిమాపక శాఖ బిల్లు

- విచారణ చేపట్టని అధికారులు
- విధుల్లోకి రాని సూత్రధారి

జగిత్యాలక్రైం: జగిత్యాల అగ్నిమాపక శాఖలో గతంలో పనిచేసి.. ఉద్యోగి విరమణ పొందిన అధికారి మరోచోట పనిచేస్తున్న వ్యక్తితో కలిసి అక్రమాలకు పాల్పడిన విషయం తెల్సిందే. ఈ విషయాన్ని ఏప్రిల్ 21న ‘సాక్షి’ ‘జగిత్యాల అగ్నిమాపక శాఖలో అక్రమాలు’ శీర్షికన కథనాన్ని ప్రచురించింది. అయినప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం విచారణ చేపట్టి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతోపాటు మరోచోట పనిచేస్తున్న వ్యక్తి అగ్నిమాపక శాఖ బిల్లులు తన ఖాతాలోకి మళ్లించుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. అగ్నిమాపక శాఖ బిల్లును అదే శాఖలో పనిచేసే ఓ వ్యక్తి తన ఖాతాలోకి మళ్లించి అవినీతికి పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తున్నా.. అతడిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకడుగు వేస్తుండడం గమనార్హం. మరోచోట పనిచేస్తున్న వ్యక్తి ‘సాక్షి’ కథనంతో దీర్ఘకాలిక సెలవులో ఉండటం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

రైతులకు ఇబ్బంది తలెత్తనివ్వొద్దు



అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తనివ్వొద్దని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులు, రైస్‌మిల్లర్స్, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు కూడా ధాన్యాన్ని తొందరగా దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమచేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రైస్‌మిల్లర్స్ పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ధర్మపురి: కార్పొరేట్ కళాశాలల్లో చదవాలనుకునే విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను పది పాసైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, డిసేబుల్డ్, మైనార్టీ విద్యార్థులు ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. పదో తరగతిలో 7.0 జీపీఏ, ఆపై గ్రేడ్ పొందిన విద్యార్థులు అర్హులని ప్రకటించింది. ప్రభుత్వ సంక్షేమ గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా, గురుకులాలు, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, నవోదయ విద్యాలయాల విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చింది. టెన్త్ మెమో, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నెంబర్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్లు ఏడేళ్లకు సంబంధించినవి జత చేయాల్సి ఉంటుంది.

నువ్వు పంట.. లాభాలే వెంట

- జిల్లాలో వెయ్యి ఎకరాల్లో సాగు
- విత్తనోత్పత్తిపై రైతుల ప్రధాన దృష్టి
- పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తల నిరంతర పర్యవేక్షణ

జగిత్యాలఅగ్రికల్చర్: గ్రామాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నా.. ఆదాయం అంతంతమాత్రమే పొందుతుంటారు. అయితే అభ్యుదయ గ్రామాల రైతులు మాత్రం వేసవిలో నువ్వు పంటను సాధారణ పంటగా కాకుండా విత్తనోత్పత్తిగా సాగు చేసి మూడేళ్లుగా మంచి ఆదాయం పొందుతున్నారు. నాణ్యమైన నువ్వుల విత్తనాన్ని తోటి రైతులకు ఇస్తూ.. సాగు విస్తీర్ణం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆ అభ్యుదయ గ్రామాలే జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్, గుల్లపేట, కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి.

ఒకే మాట మీద నిలబడి..

లక్ష్మీపూర్, గుల్లపేట, జోగిన్‌పల్లి గ్రామాల్లో సాగు నీరు పుష్కలంగా ఉండటంతో వేసవిలో ఒక్కటి, రెండు నెలలు మినహాయించి ఎప్పుడూ ఏదో పంట ఉండేలా చూసుకుంటారు. పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆయా గ్రామాలకు వెళ్లి రైతులతో సమావేశమయ్యారు. నువ్వుల నూనెకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఆ పంట వేస్తే మంచి ఆదాయం వస్తుందని, నాణ్యమైన రకాలు పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్నాయని అవగాహన కల్పించడంతో ఆయా గ్రామాల రైతులంతా పొలాస పరిశోధన స్థానానికి వెళ్లి శ్వేత థిల్, హిమ వంటి రకాలు తీసుకొచ్చి సాగు చేశారు. దిగుబడి, మార్కెట్‌లో ధర ఆశాజనకంగా కనబడటంతో అప్పటినుంచి నువ్వు పంటపై మక్కువ పెంచుకున్నారు.



రైతులు సాగు చేస్తున్న నువ్వుల పంటను పరిశీలిస్తున్న పొలాస శాస్త్రవేత్తలు

జేసీఎస్–1020 రకంతో విత్తనోత్పత్తి

రైతుల్లోని ఆసక్తిని గమనించిన నువ్వుల శాస్త్రవేత్త పద్మజ ప్రత్యేకంగా జోగిన్‌పల్లి, లక్ష్మీపూర్, గుల్లపేట రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ మూడు గ్రామాల రైతులు కనీసం వెయ్యి ఎకరాల్లో నువ్వు పంట వేశారు. 2019లో పొలాస పరిశోధన స్థానం నుంచి వెలువడిన కొత్త రకం జేసీఎస్–1020 (జగిత్యాల థిల్–1)ను రైతులకు ఇచ్చి దాని ద్వారా విత్తనోత్పత్తి చేయించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం విత్తనోత్పత్తి కింద పండించిన నువ్వులను కిలోకు రూ.200 వరకు విక్రయిస్తున్నారు. నువ్వుల విత్తనాల కోసం వచ్చే రైతులకు శాస్త్రవేత్తలు ఆయా గ్రామ రైతుల అడ్రస్ ఇచ్చే పరిస్థితి నెలకొంది.

పంట పండించడంలోనూ వినూత్నమే..

వానాకాలంలో పసుపు పండించిన భూమిలో వేసవి పంటగా నువ్వు పంట వేస్తారు. పసుపునకు కోళ్ల ఎరువు, గొర్రెల మంద, పశువుల ఎరువు వేస్తారు కాబట్టి నువ్వుల పంటకు పెద్దగా ఎరువులు వేయరు. పసుపు పంట పూర్తి కాగానే భూమిని కలియదున్ని ఎకరానికి రెండు కిలోల విత్తనాలు ఇసుకతో కలిపి చల్లుతారు. తర్వాత డ్రిప్ ద్వారా నీరు ఇస్తారు, 20 రోజులకు ఒక్కసారి, 55 రోజులకు ఒక్కసారి డ్రిప్ ద్వారా తక్కువ మోతాదులో యూరియా ఇస్తారు. పంట కాలం 90 రోజులు కాబట్టి చివరి దశలో గింజ గట్టి పడేందుకు పొటాష్ వేస్తారు. పూత దశలో పురుగులు ఆశించకుండా ఒకసారి వేపనూనె పిచికారీ చేస్తారు. అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తుండటంతో ఎకరాకు 6–7 క్వింటాళ్ల వరకు దిగుబడి తీస్తున్నారు.

ఏటా నువ్వు సాగు



ప్రతి ఏటా నువ్వుల పంటను కనీసం రెండు ఎకరాల్లో సాగు చేస్తాను. గత రెండేళ్ల నుంచి నువ్వు పంటను విత్తనోత్పత్తి కింద సాగు చేస్తున్నాను. సాధారణంతో పోల్చితే ఎకరాకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు అదనపు ఆదాయం వస్తుంది. మాకు నువ్వుల పంట కలిసి వస్తోంది.

– లక్మారెడ్డి, నువ్వుల రైతు, జోగిన్‌పల్లి

లక్ష్మీపూర్‌లో 500 ఎకరాలు..



గ్రామంలో తొలుత కొద్దిమంది రైతులు మాత్రమే నువ్వుల పంట సాగు చేసేవారు. నువ్వులను విత్తనంగా అమ్మడంతో మంచి ఆదాయం వస్తోంది. దీంతో ప్రస్తుతం మా గ్రామంలో దాదాపు 500 ఎకరాల వరకు నువ్వు పంట సాగు చేసి, సొసైటీ ద్వారా విక్రయిస్తూ లాభం పొందుతున్నాం.

– ఏలేటి రాజిరెడ్డి, నువ్వుల రైతు, లక్ష్మీపూర్

వినూత్న ఆలోచన



జేసీఎస్–1020 నువ్వుల రకానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఆ రకం నువ్వులను విత్తనంగా ఉత్పత్తి చేస్తే మంచి ఆదాయం వస్తుందని చెప్పడంతో మూడు గ్రామాల రైతులు ముందుకొచ్చారు. శాస్త్రవేత్తలం నాలుగైదు సార్లు వెళ్లి పంటను చూసి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చాం.

– డాక్టర్ పద్మజ, నువ్వుల శాస్త్రవేత్త, జగిత్యాల

క్లుప్తంగా

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటయ్య (ఫైల్‌)

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన పెద్ద బత్తుల వెంకటయ్య(38) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. వెంకటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగానే వెంకటయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు గతంలోనే చనిపోగా, కూతురికి వివాహమైంది. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఎండీ.ముబీన్‌(23) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై నరేశ్‌ వివరాల ప్రకారం.. ముబీన్‌ భార్య కొంతకాలంగా కాపురానికి రాకపోవడంతో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై, మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి మజీర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి యువకుడి మృతి



అరవింద్‌ (ఫైల్‌)

ఓదెల(పెద్దపల్లి): వ్యవసాయ బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని జీలకుంటకు చెందిన దొడ్డిపల్లి అరవింద్‌(20) బుధవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి, గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. అందరూ బుర్రలు కట్టుకొని బావిలో దిగారు. ఈత నేర్చుకుంటుండగా అరవింద్‌ వీపునకు కట్టుకున్న బుర్ర అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో అతను నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కేకలు వేయగా గ్రామస్తులు వచ్చేసరికే అరవింద్‌ చనిపోయాడు. మృతుడి తండ్రి కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి..



భూమయ్య (ఫైల్‌)

కోరుట్ల రూరల్‌: జోగిన్‌పెల్లికి చెందిన బూరుగుల భూమయ్య(62) అనే గొర్రెల కాపరి వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. భూమయ్య మంగళవారం గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. ఎండలో తిరగడంతో సాయంత్రం వాంతులు, విరేచనాలు అయ్యాయి. కుటుంబసభ్యులు స్థానికంగా చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో రాత్రి కోరుట్ల తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే చనిపోయాడు. మృతుడికి భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..

వీణవంక(హుజూరాబాద్‌): కిష్టంపేటకు చెందిన బొద్దుల బాలయ్య(98) ప్రమాదవశాత్తు బావిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. బాలయ్య బుధవారం సమీపంలోని పొలాల వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ఆయన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించారు. బాలయ్యకు మతిస్థిమితం సరిగా ఉండదని, ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడని ఆయన మనవడు రమేశ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తోటలో పేలిన తూటా

- 'జనశక్తి' వీరన్న ఎన్‌కౌంటర్‌కు పాతికేళ్లు
- తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను చాటిన ఉద్యమ నేత
- తెలంగాణవాది.. దళిత బహుజన పక్షపాతి
- హైదరాబాద్‌లో అరెస్ట్‌.. నర్సింగాపూర్‌లో ఎన్‌కౌంటర్‌



మారోజు వీరన్న (ఫైల్‌)

నర్సింగాపూర్‌లో వీరన్న ఎన్‌కౌంటర్‌ అయిన మామిడి తోట స్థలం

సిరిసిల్ల: బహుజన సిద్ధాంతం.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా విప్లవ ఉద్యమాలు రూపొందించారు మారోజు వీరన్న. కులాల ప్రాతిపదికన ఉద్యమించాలని నమ్మి.. సహచరులతో విభేదించి సొంతంగా విప్లవోద్యమాన్ని నిర్మించారు. రెండున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ఆయనపై ప్రత్యేక కథనం.

ఉద్యమనేలలో విప్లవ బీజం

ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట నెత్తురు పారని రోజు లేదు. సమసమాజ స్థాపన కోసం నక్సలైట్లు.. వారిని కట్టడి చేసేందుకు పోలీసులు.. ఇలా జిల్లాలో కాల్పులు.. ఎదురు కాల్పులు నిత్యకృత్యం. నేటి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెలు ఆనాడు వామపక్ష ఉద్యమాలకు పురిటిగడ్డలు. ఇక్కడ 'దున్నేవాడికే భూమి' నినాదంతో మొదలైన రైతుకూలి పోరాటం సాయుధ విప్లవోద్యమాలుగా రూపాంతరం చెందాయి. సీపీఐ(ఎంఎల్‌) జనశక్తి అగ్రనేత మారోజు వీరన్న ఈ ప్రాంతంలో ఉద్యమాలు రూపొందించారు. 1999, మే16న బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌ శివారులోని మామిడితోటలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరన్న ప్రాణాలు కోల్పోయారు.

పీడీఎస్‌యూ అగ్రనేతగా..

- మారోజు వీరన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో 1962లో వడ్రంగి కుటుంబంలో జన్మించారు.
- స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య, సూర్యాపేటలో ఇంటర్మీడియెట్‌, సైఫాబాద్‌ కాలేజీలో బీఎస్సీ, ఓయూలో ఎమ్మెస్సీ చదివారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.
- 14 ఏళ్ల ప్రాయంలో 'అన్యాయం', 'ఊరు తిరగబడింది' అనే నాటకాలు రాశారు.
- వీరన్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ సీపీఐ(ఎంఎల్‌) జనశక్తి పార్టీ అగ్రనేత కూర రాజన్నతో కలిసి పనిచేశారు.



తుంగతుర్తి వద్ద వీరన్న స్మారక స్తూపం

- అప్పట్లో మెడికల్‌, డెంటల్‌ కాలేజీల్లో క్యాపిటల్‌ ఫీజులను ప్రభుత్వం విధించడంపై పోరాడి ఆ ఫీజులను రద్దు చేయించారు.
- 1991లో మండల్‌ కమిషన్‌ ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు.
- 1994లో కరీంనగర్‌ జిల్లా చొప్పదండి నుంచి వీరన్న ఎమ్మెల్యేగా పోటీచేసి 22వేల ఓట్లు సాధించారు.

కూర రాజన్నతో విభేదించి..

జనశక్తి పార్టీ అగ్రనేతల్లో ఒకరుగా ఉంటూ వీరన్న కుల, వర్గ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో కులాలు ఉన్నాయని, కుల ప్రాతిపదికన సంఘాలను బలోపేతం చేస్తేనే విప్లవోద్యమాలు బలపడతాయని వీరన్న సూత్రీకరించగా.. జనశక్తి అగ్రనేతలు ఈ వాదనను విభేదించారు. విప్లవ గ్రూపుల్లో కులప్రస్తావన అర్థరహితమని కొట్టిపారేశారు. దీంతో 1995లో చంద్రపుల్లారెడ్డి వర్గంలోని జనశక్తి గ్రూపు నుంచి విడిపోయి జనశక్తి వీరన్న వర్గం, జనశక్తి రాజన్న వర్గంగా(మే 17)న రెండు విప్లవ గ్రూపులు ఏర్పాటయ్యాయి. అప్పటికే ఉమ్మడి కరీంనగర్‌, నల్గొండ, వరంగల్‌, ఖమ్మం జిల్లాలకు చెందిన 14 సాయుధ దళాలు వీరన్న వెంట నడిచాయి. జనశక్తి రాజన్న వెంట కేవలం 9 సాయుధ దళాలు ఉన్నాయి. ఫలితంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో వీరన్న వర్గం సాయుధ దళాలు రెండు ఏర్పాటయ్యాయి. ఈక్రమంలోనే జనశక్తి రాజన్నవర్గం, వీరన్న వర్గాల మధ్య అంతర్గత కలహాలు బయటపడ్డాయి. జిల్లాలో అప్పటికే పీపుల్స్‌వార్‌, జనశక్తి పార్టీలు ఉండగా.. కొత్తగా వీరన్న వర్గం ఏర్పడింది. 1999 జనవరిలో వీరన్న వర్గానికి చెందిన 11 మంది సాయుధులను గంభీరావుపేట మండలం నాగంపేట వద్ద మామిడితోటలో పోలీసులు ఎన్‌కౌంటర్‌ చేశారు. ఈ సాయుధులను హైదరాబాద్‌ శివారులో ఓ ఇంట్లో నిర్బంధించి నాగంపేట వద్ద ఎన్‌కౌంటర్‌ చేసినట్లు అప్పట్లో ఆ పార్టీ ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్‌తో జనశక్తి వీరన్న వర్గం కార్యకలాపాలు జిల్లాలో సద్దుమణిగాయి. కానీ ఉమ్మడి నల్గొండ, వరంగల్‌, ఖమ్మం జిల్లాలో పనిచేశాయి.

నర్సింగాపూర్‌ వద్ద వీరన్న ఎన్‌కౌంటర్‌

బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌ మామిడి తోటలో 1999, మే 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మారోజు వీరన్న మరణించారు. ఆయనను హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌ వినాయక్‌నగర్‌లో పట్టుకొని నర్సింగాపూర్‌కు తెచ్చి ఎన్‌కౌంటర్‌ చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. పార్టీ కొరియర్‌ సిద్ధేశ్వర్‌తో కలిసి వెళ్తుండగానే వీరన్నను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని మారుతీవ్యాన్‌లో తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అప్పటికే మారోజు వీరన్న రాష్ట్ర సాధన కోసం తెలంగాణ మహాసభలను ఏర్పాటు చేసి సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. విప్లవకారుడిగా, వక్తగా, ఆలోచనపరుడిగా అనేక వ్యాసాలు, పాటలు రాసి, పాడారు. 1989లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించినప్పుడు జగిత్యాలతో ఆత్మీయ సన్మానసభ నిర్వహించారు. ఈ సభలో వీరన్న జనశక్తి శ్రేణులను ఉత్సాహ పరిచేందుకు 'అందుకోర గుప్త అందుకో ఈ దొంగల తరిమేతందుకు' అంటూ.. విప్లవ గీతాలను ఆలపించి సభను ఉర్రూతలూగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను బలంగా చాటిచెప్పారు. వీరన్న రాష్ట్ర సాధన ఉద్యమాన్ని బలంగా తీసుకెళ్తున్న క్రమంలో ఎన్‌కౌంటర్‌ అయ్యారు.

వీరన్న సంస్మరణ సభలు..

జిల్లాలో వీరన్న సంస్మరణ సభలను ఆయన అభిమానులు, ప్రగతిశీల వాదులు ఏటా నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహించి విప్లవ యోధుడికి నివాళి అర్పిస్తారు.

ఆమె నేత్రాలు సజీవం



అహల్యమ్మ (ఫైల్‌)

కమాన్‌పూర్‌(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన పెరటి అహల్యమ్మ అనే వృద్ధురాలు బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకురాగా, సదాశయ ఫౌండేషన్‌, కమాన్‌పూర్‌ లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో టెక్నీషియన్‌ ఆరిఫ్‌ సేకరించారు. ఈ సందర్భంగా అహల్యమ్మ కుటుంబసభ్యులను ఫౌండేషన్‌ జాతీయ, లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్‌, రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కవిత, క్లబ్‌ కార్యదర్శి శంకర్‌ అభినందించారు.

కుక్కల దాడిలో మేకలు మృతి



చనిపోయిన జీవాలతో మున్సిపల్‌ ఆఫీస్‌లో ధర్నా చేస్తున్న అజీజొద్దీన్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లి బస్టాండ్‌ ప్రాంతంలో అజీజొద్దీన్‌కు చెందిన మేకల మందపై బుధవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 4 మేకలు చనిపోయాయి. దీనిపై ఆగ్రహించిన యజమాని అజీజొద్దీన్‌ చనిపోయిన జీవాలతో కొత్తపల్లి మున్సిపల్‌ కార్యాలయంలోకి వెళ్లి, ధర్నాకు దిగారు. తనకు సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందన్నారు. గతంలోనూ 5 మేకలను చంపేయడంతో 9 ఫీట్ల ప్రహరీ నిర్మించానని, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజు హామీ ఇవ్వడంతో బాధితుడు ఆందోళన విరమించాడు. చికెన్‌ సెంటర్ల వ్యర్థాలను సేకరించడంలో మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డీజిల్‌ ట్యాంకర్‌ పడి ఒకరి దుర్మరణం

- ఏడుగురికి తీవ్ర గాయాలు
- తాడికల్‌ గ్రామంలో ఘటన



శ్రీనివాస్‌ (ఫైల్‌)



ట్యాంకర్‌ను క్రేన్‌ సహాయంతో పక్కకు తీయిస్తున్న పోలీసులు

శంకరపట్నం(మానకొండూర్‌): రోడ్డు పక్కనున్నవారిపై డీజిల్‌ ట్యాంకర్‌ పడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలంలోని తాడికల్‌ గ్రామానికి చెందిన ముదిరాజ్‌ కులస్తులు బుధవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి హాజరైన సీనియర్‌ ఖోఖో ప్లేయర్‌ పూదరి శ్రీనివాస్‌, సాగంటి ప్రకాశ్‌ నీళ్లు తాగేందుకు వాటర్‌ ప్లాంట్‌ వద్దకు వెళ్తున్నారు. అదే సమయంలో హుజూరాబాద్‌ వైపు నుంచి అంబాల్‌పూర్‌ వెళ్లాల్సిన జాతీయ రహదారి నిర్మాణ సంస్థ డీబీఎల్‌కు చెందిన డీజిల్‌ ట్యాంకర్‌ రావడంతో రోడ్డు దిగి, పక్కన నిల్చున్నారు. కరీంనగర్‌ ఆస్పత్రికి, ఇతర పనుల కోసం వెళ్లడానికి ఆర్టీసీ బస్సు కోసం తాడికల్‌కు చెందిన వంగల కనకమ్మ, తాడిచర్ల సంపత్‌, ఉప్పరి మధురమ్మ, చింతగుట్టకు చెందిన ఆడెపు లాస్య, ఆడెపు మౌనిక, మంద రాజమ్మ అక్కడే చెట్టు కింద కూర్చున్నారు. డీజిల్‌ ట్యాంకర్‌ అక్కడికి చేరుకోగానే పక్కకు ఒరిగి, వారిపై పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌ ట్యాంకర్‌ కింద నలిగి, మృతిచెందాడు. మిగతా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

అంతకుముందు మరొకరిని ఢీకొన్న ట్యాంకర్‌

డీజిల్‌ ట్యాంకర్‌ ఈ ప్రమాదానికి ముందు వంకాయలగూడెం వద్ద అదే గ్రామానికి చెందిన జడల రాజయ్యను ఢీకొట్టడంతో అతను గాయపడ్డాడు. గ్రామస్తులు పట్టుకుంటారేమోనన్న భయంతో డ్రైవర్‌ ట్యాంకర్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. ఆ హడావుడిలోనే తాడికల్‌ గ్రామంలో స్పీడ్‌ బ్రేకర్‌ వద్ద సడన్‌ బ్రేక్‌ వేయడంతో ట్యాంకర్‌ గ్రామస్తులపై బోల్తా పడింది.

ట్రాఫిక్‌ జాం..

సమాచారం అందుకున్న హుజూరాబాద్‌ ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఎస్సైలు లక్ష్మారెడ్డి, ఆరోగ్యం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్యాంకర్‌ నుంచి డీజిల్‌ కారడంతో రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్‌ జాం అయింది. పోలీసులు క్రేన్‌ సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు జరిపించారు. ఆ సమయంలో ట్యాంకర్‌ నుంచి డీజిల్‌ ఎక్కువగా కారడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పంచాయతీ ట్యాంకర్‌ ద్వారా నీటిని తెప్పించి, చల్లించారు. శ్రీనివాస్‌ మృతదేహాన్ని హుజూరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రహదారి సంస్థకు చెందిన సూపర్‌వైజర్‌పై గ్రామస్తులు చేయిచేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ డ్రైవర్‌ను గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోదిస్తున్న మృతుడి కుమారుడు, కూతురు, సోదరుడు

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి 25 ఏళ్ల జైలు

జగిత్యాల జోన్‌: కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ కసాయి తండ్రికి 25 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. అంతేకాకుండా, బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మల్లికార్జున్‌ కథనం ప్రకారం.. కోరుట్ల మండలం ఎఖిన్‌పూర్‌కు చెందిన ఎల్లాల తుకారాం వ్యవసాయం చేసేవాడు. భార్యను కత్తితో పొడిచి, చంపాడు. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. తర్వాత కొడుకు తండ్రితో తెగదెంపులు చేసుకొని, నానమ్మ వద్ద ఉంటున్నాడు. అనంతరం తుకారం రెండో పెళ్లి చేసుకున్నాడు. అతని వేధింపులు భరించలేక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత, మూడో పెళ్లి చేసుకోగా ఒక కూతురు జన్మించింది. అయితే, అక్టోబర్‌ 14, 2022న రాత్రి తూకారాం తన భార్య, 12 ఏళ్ల కూతురితో కలిసి భోజనం చేసి, నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బిడ్డ కేకలు విని నిద్ర లేచిన తల్లికి జరిగిన సంఘటనను వివరించింది. దీంతో ఆగ్రహించిన ఆమె భర్తను కోప్పడగా, విషయం ఎక్కడైనా చెబితే ఇద్దరినీ పెట్రోల్‌ పోసి, చంపుతానని బెదిరించాడు. రెండు రోజులకు వారు తుకారం మొదటి భార్య కొడుకు మహేశ్‌కు చెప్పారు. అతని సహాయంతో కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై సతీశ్‌ కేసు నమోదు చేయగా, సీఐ రాజశేఖర్‌ రాజు దర్యాప్తు చేపట్టారు. తూకారాంను అరెస్టు చేసి, కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌ సిబ్బంది కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో తుకారాంకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు

మేడిపల్లి(జగిత్యాల): హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ జగిత్యాల న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఎస్సై శ్యాంరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓరుగంటి రాజు, పూదరి లక్ష్మణ్‌.. ఇద్దరిదీ భీమారం మండల కేంద్రం. నాలుగేళ్ల క్రితం పెళ్లి బరాత్‌లో గొడవ పడ్డారు. రాజు క్షణికావేశంలో లక్ష్మణ్‌ను కత్తితో పొడిచి, హత్య చేశాడు. మృతుడి అన్న సతీశ్‌ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేయగా సీఐ రాజశేఖర్‌ విచారణ చేపట్టి, కోర్టులో చార్జిషీట్‌ వేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బుధవారం రాజుకు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

పెట్రోల్‌ బంకు సమీపానికి మంటలు


- ఆర్పివేసిన పోలీసులు
- బంధంపల్లిలో తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి పట్టణ శివారు బంధంపల్లిలో బుధవారం ఓ రైతు తన పొలంలో వరికొయ్యలకు నిప్పుపెట్టాడు. మంటలు చెలరేగి, స్థానిక పెట్రోల్‌బంకు సమీపంలోకి రావడాన్ని గమనించిన ఏఎస్సై రామస్వామి పోలీస్‌ సిబ్బంది శరత్‌, శ్రీకాంత్‌, డ్రైవర్‌ శ్రీనివాస్‌తో కలిసి వాటిని అదుపు చేస్తూ నే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోగా మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరగకుండా చూసిన పోలీసులను పలువురు అభినందించారు.

జేవీ చలపతిరావుకు మాతృవియోగం



సూరమ్మ (ఫైల్‌)

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్‌ జేవీ చలపతిరావు తల్లి సూరమ్మ(90) బుధవారం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో మరణించారు. సిరిసిల్ల భూపోరాట ఉద్యమంలో, రైతాంగ పోరాట నిర్మాణంలో చలపతిరావుకు బాటలు వేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన జువ్వాడి సూరమ్మ, మురళీమనోహర్‌రావు దంపతుల కొడుకు చలపతిరావు. ఆయన విద్యార్థి దశలోనే ఉద్యమాల వైపు సాగాడు. సీపీఐ(ఎంఎల్‌) జనశక్తి ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. మూడు దశాబ్దాలపాటు అజ్ఞాత జీవితం గడిపారు. 1994లో అజ్ఞాతవాసం వీడి, సిరిసిల్ల ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆయన తల్లి సూరమ్మ సిరిసిల్ల ప్రాంతంలో కరుడుగట్టిన భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ముందునిలిచారు. దొరలు, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రజాపోరాటాలకు సూరమ్మ సాక్షీభూతమయ్యారు. సూరమ్మ హైదరాబాద్‌లోని తన చిన్నకుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు గురువారం ఉదయం 9 గంటలకు అల్వాల్‌ శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. సూరమ్మ మృతిపై రాజన్నసిరిసిల్ల జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు సంతాపం ప్రకటించారు.

విద్యుత్‌ సేవల్లో పెద్దపల్లి టాప్‌



సుదర్శనం, ఎస్‌ఈ

పెద్దపల్లిరూరల్‌: ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని 16 సర్కిళ్లలో నాణ్యమైన విద్యుత్‌ సేవలు అందించడంలో మనజిల్లా అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శనం తెలిపారు. అదేవిధంగా అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరు కనబర్చి మంచి ర్యాంకులు సాధించారని అన్నారు. సుల్తానాబాద్‌ మండలం కాట్నపల్లికి చెందిన ఏఈ సైఫుదీన్‌కు ప్రథమ ర్యాంక్‌ వచ్చిందన్నారు. ఆపరేషన్‌, మెయింటనెన్స్‌లో ఫోర్‌మెన్‌ వరకు ఏఈ, సబ్‌ఇంజినీర్‌.. ఇలా అన్ని విభాగాల సహకారంతోనే జిల్లాకు ఈ గౌరవం దక్కిందని ఎస్‌ఈ పేర్కొన్నారు. మేలో విద్యుత్‌ వినియోగం అధికంగా ఉన్నా.. ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కొత్త విద్యుత్‌ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే సత్వరమే మంజూరు చేస్తామని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన యెల్ల రమేశ్‌ బుధవారం ద్విచక్రవాహనంపై చందుర్తి వెళ్తున్నాడు. మల్యాల బస్టాండ్‌లో చందుర్తి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

వికటించిన మహిళా ఆర్‌ఎంపీ వైద్యం

- చావుబతుకుల మధ్య వృద్ధురాలు
- ఎక్కువ రోజులు బతకదన్న వైద్యులు
- ఇంటికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు



వారం క్రితం చికిత్స పొందుతున్న కనకవ్వ

మానకొండూర్‌ రూరల్‌: మహిళా ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి, ఓ వృద్ధురాలు చావుబతుకుల మధ్య ఉంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. లింగాపూర్‌ గ్రామంలోని రాంనగర్‌ బేడబుడిగ జంగాల కాలనీకి చెందిన భూపతి కనకవ్వకు ఈ నెల 2న జ్వరం వచ్చింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు వైద్యం కోసం స్థానిక ఆర్‌ఎంపీ మమతను ఇంటికి పిలిపించారు. కనకవ్వను పరీక్షించిన ఆమె, గ్లూకోజ్‌ పెట్టి, అందులో ఇంజెక్షన్‌ కలిపి వెళ్లిపోయింది. 30 నిమిషాల తర్వాత ఆ వృద్ధురాలి శరీరంపై దద్దుర్లు, బొబ్బలు రావడంతో ఆర్‌ఎంపీకి సమాచారం ఇచ్చారు. ఆమె మళ్లీ వచ్చి, ఇంకో ఇంజెక్షన్‌ వేసి, వెళ్లిపోయింది. 20 నిమిషాల తర్వాత కనకవ్వ నాలుక లావై, కాళ్లుచేతులు చచ్చుబడిపోయాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లి, 6 రోజులు చికిత్స చేయించారు. అక్కడినుంచి మరో దవాఖానాలో చేర్పించారు. కనకవ్వ ఎక్కువ రోజులు బతకదని వైద్యులు నిర్ధారించడంతో మంగళవారం రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బాధితురాలి కుమారుడు రమేశ్‌ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్‌ తెలిపారు.

గుంజపడుగులో ప్రహరీ వివాదం

- ఇరు కుటుంబాల మధ్య గొడవ
- ఇల్లు ధ్వంసం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీస్‌ పికెట్‌ ఏర్పాటు



ధ్వంసమైన ఇల్లు



గ్రామంలో పోలీస్‌ పికెట్‌

గొల్లపల్లి(ధర్మపురి): ప్రహరీ విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా, ఒకరి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఎస్సై సతీశ్‌కుమార్‌ వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలంలోని గుంజపడుగుకు చెందిన క్లోం తిరుపతి, పస్తం శారద ఇళ్ల మధ్య ప్రహరీ ఉంది. దీని గురించి కొంతకాలంగా ఇరుకుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మాటామాట పెరిగి, తిరుపతి శారద ఇంటిపై దాడి చేసి, ఆమెను దూషించాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులు సైతం గొడవకు దిగారు. ఇరుకుటుంబాల వారు కర్రలతో దాడి చేసుకునేవరకు వెళ్లారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంఘటనలో తిరుపతి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. విషయం పోలీసులకు తెలియడంతో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై సతీశ్‌కుమార్‌ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీస్‌ పికెట్‌ ఏర్పాటు చేశారు. అప్పటికే శారద సోదరులు సమ్మయ్య, పోచయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేశ్‌, శ్రీకాంత్‌తోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.